**విలేకరులు కావలెను**

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక — సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 77 శనివారం జూలై 18 2026, పేజీలు - 4 వెల :2/-


# ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హెల్త్ స్కీమ్





- తెలంగాణలో న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ప్రారంభం
- ఉద్యోగులు, పెన్షనర్లు సహా 17.88 లక్షల మందికి లబ్ధి
- రాష్ట్రంలోని 1000కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత వైద్యం
- డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా సేవలు.. చీజునూ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ
- ఉద్యోగుల వాటాకు సమానంగా ప్రభుత్వ వాటా.. ప్రత్యేక ట్రస్ట్ ద్వారా నిధుల నిర్వహణ

హిందూస్తాన్ మీడియా

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చిరకాలంగా నిరీక్షిస్తున్న 'న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్' (ఎన్ఈహెచ్ఎస్) శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారిక పత్రాలతో పాటు, చీజునూ వెబ్ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులను వారు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.39 లక్షల మంది ఉద్యోగులు, 3.62 లక్షల మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 17.88 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. వీరికి 114 ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అపోలో, యశోద, కిమ్స్, కేర్, స్టార్ వంటి 886 ప్రముఖ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) ధరలకు అనుగుణంగా 1,816 రకాల మెడికల్, సర్జికల్ ప్యాకేజీలను ఈ పథకంలో పొందుపరిచారు. పథకం నిర్వహణ కోసం ఉద్యోగులు, పెన్షనర్లు తమ ప్రాథమిక వేతనం లేదా పెన్షన్‌లో 1.5 శాతం వాటాను విరాళంగా అందజేస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా తన వంతుగా జమ చేస్తుంది. నిధుల నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ ప్రభుత్వ, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులతో కూడిన ఒక ప్రత్యేక ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు చీజునూ పోర్టల్ ద్వారా తమ డిజిటల్ హెల్త్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. గత ఆరోగ్య పథకంలోని లోపాలను అధిగమిస్తూ, ఉద్యోగ సంఘాల నుంచి అందిన సూచనల మేరకు ఈ సరికొత్త పథకాన్ని అత్యంత పకడ్బందీగా రూపొందించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జూలై మధ్య నాటికి ఈ నగదు రహిత సేవలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. ఈ పథకం ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం నుంచి భారీ ఊరటనిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

## ఓటర్ల జాబితా సవరణ: తెలంగాణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి

- తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వేగవంతం
- రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్టు వెల్లడి
- గ్రామీణ ప్రాంతాల్లో 80, పట్టణాల్లో 45 శాతం పురోగతి
- సంగారెడ్డి జిల్లాలో క్షేత్రస్థాయిలో సమీక్షించిన ఎన్నికల కమిషనర్
- గడువు పొడిగింపును దృష్టిలో ఉంచుకోవాలని అధికారులకు ఆదేశం




హిందూస్తాన్ మీడియా

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకు 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ క్యాంపులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సవరణ ప్రక్రియ జరుగుతున్న తీరును బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. శిబిరాల వద్ద ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ మాట్లాడారు. వారికి పార్టీలు తరఫున గుర్తింపు కార్డులు జారీ అయ్యాయా అన్న అంశంపై ఆరా తీశారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు, బీఎల్‌ఓల సమన్వయంతో ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. పొడిగించిన గడువును దృష్టిలో ఉంచుకుని సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని పక్షంలో, వాటిని వెంటనే సూపర్ వైజర్ల నుంచి సేకరించాలని ఆయన ఆదేశించారు.

# ఆక్వా, పొగాకు రైతులను ఆదుకోండి.. హార్టికల్చర్ హబ్‌కు నిధులివ్వండి

హిందూస్తాన్ మీడియా

ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన వినతులు సమర్పించారు. శుక్రవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆక్వా, పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించాలని, రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన హార్టికల్చర్ హబ్‌కు సహకరించాలని సీఎం కోరారు.

**ఆక్వా రంగంపై తక్షణమే దృష్టి సారించాలి**

ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, తక్షణం కేంద్రం విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు కోరారు. రొయ్యల మేత తయారీకి ఉపయోగించే ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం 20 శాతానికి పైగా పెరిగిందని వివరించారు. ఫిష్ మీల్ టన్ను రూ.1.55 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు, చేప నూనె టన్ను రూ.2.80 లక్షల నుంచి రూ.4.40 లక్షలకు పెరిగిందని గణాంకాలతో సహా వివరించారు. ఈ భారం టన్నుకు రూ.25 వేల వరకు పెరిగిందన్నారు. అదే సమయంలో, భారత్ నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలపై అమెరికా 5.77 శాతం కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ విధించిందని, యాంటీ డంపింగ్ డ్యూటీ వేసే ఆలోచనలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రొయ్యల ఎగుమతుల్లో 80 శాతం ఏపీ నుంచే జరుగుతున్నాయని, ఈ సుంకాల వల్ల రాష్ట్రంలోని 30 లక్షల మంది జీవనోపాధి దెబ్బతింటుందని తెలిపారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాతో సంప్రదింపులు జరపాలని, రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌తో 'ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కోఆర్డినేషన్ కమిటీ' ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**పొగాకు రైతులను ఆదుకోవాలి**

జీఎస్టీలో పొగాకు ఉత్పత్తులను అత్యధిక పన్ను శ్లాబులో చేర్చడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీని కారణంగా తయారీదారులు కొనుగోళ్లు తగ్గించడంతో వేలం ప్రక్రియ నెమ్మదించిందన్నారు. ఈ ఏడాది 230 మిలియన్ కేజీల ఉత్పత్తికి గాను కేవలం 34 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు చేశారని, ఇది రైతులు, కార్మికులు, రవాణా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని వివరించారు. ఈ సమస్యను



పరిష్కరించి పొగాకు రైతులను ఆదుకోవాలని కోరారు.

**రాయలసీమ సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళిక**


రాయలసీమను దేశంలోనే అగ్రగామి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన 'రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టీకల్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్'కు పూర్తి సహకారం అందించాలని చంద్రబాబు కోరారు. ఈ ప్రణాళిక ద్వారా రూ.40 వేల కోట్ల ప్రభుత్వ, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో ఏటా రూ.81 వేల కోట్ల స్థూల విలువ జోడింపు, 19.7 లక్షల ఉద్యోగాలు సృష్టించ వచ్చని వివరించారు. ఆగస్టు 6-7 తేదీల్లో ఈ ప్రాజెక్టు పనుల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని నిర్మలా సీతారామన్‌ను ఆహ్వానించారు.

## పోసాన్‌పల్లి సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డీపీవోకు వినతి



కొమురవెల్లి, హిందుస్థాన్ మీడియా:
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామపంచాయతీ ట్రాక్టర్, సిబ్బందిని సర్పంచ్ వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ కొమురవెల్లి మండల సీపీఎం నాయకులు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)కు వినతిపత్రం సమర్పించారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ వినియోగానికి సంబంధించిన లాగ్‌బుక్, డీజిల్ ఖర్చుల వివరాలు, ఇతర రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమైతే సంబంధిత సర్పంచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డీపీవోను కోరారు

## నర్సాయపల్లి అభివృద్ధి పనులు పరిశీలించిన సీఈవో రమేష్



మద్దూరు, హిందుస్థాన్ మీడియా:
(ఆర్. కె. శ్రీను ) సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామాన్ని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్ శుక్రవారం సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ శనిగరం సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ భవనం, గ్రామపంచాయతీ భవనం, పిట్టలగూడెం ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా భవనం, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నర్సాయపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలనిప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అలాగే మద్దూరు కేజీబీవీ, జిల్లా పరిషత్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, గ్రామ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సీ.జీ.హెచ్.ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ కొండా నాగార్జునకు పదోన్నతి



హిందుస్థాన్ మీడియా
గుంటూరు సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీ.జీ.హెచ్.ఎస్) వెల్‌నెస్ సెంటర్‌లో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కొండా నాగార్జున చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీ.ఎం.ఓ)గా పదోన్నతి పొందారు. ఆయనను గుంటూరుకే కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.శనివారం ఆయన అధికారికంగా సీ.ఎం.ఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు.ఇటీవలే నెల్లూరు సీ.జీ.హె చ్.ఎస్ నుంచి బదిలీపై వచ్చిన డాక్టర్ దాసరి రమేష్ ప్రస్తుతం గుంటూరులో సీ.ఎం.ఓగా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ కొండా నాగార్జునకు కూడా పదోన్నతి లభించడంతో గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్‌లో ఇద్దరు చీఫ్ మెడికల్ ఆఫీసర్లు సేవలందించడం విశేషంగా నిలిచింది.పదోన్నతి సందర్భంగా గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు గుమ్మడి సీతారామయ్య చౌదరి,కట్టా వెంకటేశ్వర్లు, ఉద్యోగులు,పెన్షనర్లు,వైద్య సిబ్బంది డాక్టర్ నాగార్జునకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండా నాగార్జున మాట్లాడుతూ, గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల,ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.నగదు రహిత (క్యాష్‌లెస్) ఎంపానెల్డ్ ఆసుపత్రులపై వస్తున్న ఫిర్యాదులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అనంతరం గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో పెరుగుతున్న రోగుల రద్దీ దృష్ట్యా అదనంగా మరో వైద్యుడిని నియమించాలని కోరుతూ లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు గుమ్మడి సీతా రామయ్య చౌదరి,కట్టా వెంకటేశ్వర్లు చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు, సీ.జీ.హెచ్.ఎస్ డైరెక్టర్ కార్యాలయానికి వినతిపత్రం సమర్పించారు.

# చేర్యాలలో బెల్టు షాపుల రద్దుకై కౌన్సిలర్ గీతాంజలి ఆధ్వర్యంలో నిరసన!

**-24 గంటల విచ్చలవిడి మద్యం అమ్మకాలతో రోడ్డున పడుతున్న పేద కుటుంబాలు**

**-బెల్టు షాపులను బంద్ చేయాలంటూ సంతకాల సేకరణ**



చేర్యాల (హిందూస్తాన్ మీడియా):
చేర్యాలలో నాంది పలికిన 2వ వార్డు కౌన్సిలర్ చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో విచ్చలవిడిగా సాగుతున్న అక్రమ మద్యం అమ్మకాలపై మహిళలు, వార్డు ప్రజలు తిరుగుబాటు చేశారు. వార్డులో వెలిసిన బెల్టు షాపులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కౌన్సిలర్ గీతాంజలి నేతృత్వంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మద్యం మహమ్మారి వల్ల నిరుపేద కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్న వైనంపై వార్డు మహిళలు, ప్రజలను ఏకం చేస్తూ కౌన్సిలర్ తీసుకున్న ఈ చొరవ పట్టణంలో ఒక కొత్త మార్పునకు నాంది పలికింది.

**-ఈ నిరసనను ఉద్దేశించి వార్డు కౌన్సిలర్ గీతాంజలి మాట్లాడుతూ..**

పట్టణంలోని బెల్టు షాపుల ద్వారా రోజుకు 24 గంటల పాటు విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని మండిపడ్డారు. ఈ అక్రమ అమ్మకాల వల్ల వార్డులోని యువత, సామాన్య పౌరులు మద్యానికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సంపాదించిన డబ్బునంతా మద్యానికి తగలేస్తూ, ఆరోగ్యం పాడుచేసుకుని నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నారని ఆరోపించారు. మద్యం మహమ్మారి వల్ల ఎన్నో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డ పరిస్థితిని మనం కళ్లారా చూస్తున్నామని, ఇలాంటి దారుణాలను అరికట్టాలంటే వార్డులోని బెల్టు షాపులను తక్షణమే బంద్ చేయించక తప్పదని ఆమె డిమాండ్ చేశారు.

**-200 మందితో సంతకాల సేకరణ అధికారులకు వినతిపత్రాలు**

?బెల్టు షాపులను శాశ్వతంగా తొలగించాలనే డిమాండ్‌తో వార్డులోని సుమారు 200 మంది మహిళలు, పురుషులతో ఒక భారీ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంతకాలతో కూడిన వినతిపత్రాల ప్రతులను చేర్యాల పట్టణ అబ్కారి (ఎక్సైజ్) సీఐ, మున్సిపల్ కమిషనర్, మరియు చేర్యాల పోలీస్ శాఖ అధికారులకు పంపించినట్టు వారు తెలిపారు.అధికారులు స్పందించి బెల్టు షాపులను తక్షణమే సీజ్ చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వార్డు ప్రజలు హెచ్చరించారు.

**-నిరసనకు భారీ మద్దతు**

వార్డు ప్రజల భవిష్యత్తు కోసం మరియు అక్రమ మద్యం నివారణ కోసం చేపట్టిన ఈ ప్రజా నిరసన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చెవిటి లింగం, చందా అనిల్ కుమార్, కాటం మహేష్, చిన్న మహేష్, కమలాపురం రాజశేఖర్, ఆకుల అంజయ్య, వలిమే భాను, బుడిగే భానులతో పాటు రెండవ వార్డుకు చెందిన మహిళలు, యువకులు మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఆకునూరులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం ఎంపీ చామల, ఎమ్మెల్యే పల్లా చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు

చేర్యాల/ఆకునూరు (హిందూస్తాన్ మీడియా):
సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం అధికారికంగా శ్రీకారం చుట్టారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంయుక్తంగా ఈ ప్రారంభోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఐదు మహిళా సంఘాల భవనాలను, అలాగే రూ.4 లక్షల నిధులతో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ మరుగుదొడ్ల భవనాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా స్థానికంగా నిర్మించ తలపెట్టిన నూతన గిడ్డంగి (గోదాం) భవన నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు.

**-బోనాలు, మంగళహారతులతో ఘన స్వాగతం**

ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ఆకునూరు గ్రామానికి చేరుకున్న సందర్భంగా గ్రామ మహిళలు, ఐకేపీ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బోనాలు, మంగళ హారతులతో వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర వికాసానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఆకునూరు గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, ఇతర ప్రజా అవసరాల నిమిత్తం తమ వంతు నిధుల సహకారాన్ని పూర్తిగా అందిస్తామని హామీ ఇచ్చారు.

**-రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు: సర్పంచ్ కొమ్ము రవి**

గ్రామ సర్పంచ్ కొమ్ము రవి మాట్లాడుతూ.. ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక చొరవ మరియు అధికారుల సహకారంతో ఆకునూరు గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ.1.20 కోట్ల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, మహిళా సంఘాల భవనాలు, డ్రైనేజీ కాలువలు తదితర మౌలిక సదుపాయాల పనులను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. తమ గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు నిరంతరం సహకరిస్తున్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి, జిల్లా



కలెక్టర్ కె. హైమావతికి గ్రామ ప్రజల తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**-భారీగా తరలివచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు**

గ్రామ పండుగను తలపించిన ఈ ప్రగతి ఉత్సవంలో ఆర్డీవో సదానందం, ఏసీపీ సదానందం, ఉపసర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, వార్డు సభ్యులు అందె లక్ష్మి, సూర అనిత, జూపల్లి కార్తీక్ రెడ్డి, తాటికొండ శేఖర్, భూమిని భాస్కర్, గణపురం బాలనరసమ్మ, అంజయ్య, మంతపురి భాగ్యలక్ష్మి, స్వర్గం రాజేష్‌లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ముఖ్య నాయకులు మరియు ఆకునూరు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండాలి :ఎమ్మెల్యే పల్లా

**-ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా 500 మందికి ఉపాధి**

కొమురవెల్లి, హిందుస్థాన్ మీడియా:
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కొమురవెల్లిలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు ప్రమాణిత విత్తనాలు, నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉండటం వ్యవసాయాభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. మత్స్యకారులు, ముదిరాజ్ కులస్థుల ఆర్థికాభివృద్ధికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కొండపాక ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం వల్ల సుమారు 500 మంది సభ్యులకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు వారి ఆర్థిక స్థితి మెరుగు పడుతుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా నాణ్యమైన విత్త నాలు, ప్రమాణిత ఎరువులను



వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, వ త్స్యకారులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం కొమురవెల్లిలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం అత్యంత అవసరమని అన్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న నూతన భవనాల ద్వారా చిన్నారులకు సురక్షితమైన, పరిశు భ్రమైన వాతావరణంలో సేవలు అందు బాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు, ఫిషరీస్ ప్రొడ్యూసర్ కంపెనీ సభ్యులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు సముచిత గుర్తింపు కల్పించాలి

**-అమర జ్యోతి వద్ద జేఏసీ నాయకుల డిమాండ్**



హైదరాబాద్/జనగామ, హిందుస్థాన్ మీడియా:
హైదరాబాద్‌లోని తెలంగాణ అమర జ్యోతి వద్ద నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశానికి జనగామ జిల్లా నుంచి ప్రత్యేక తెలంగాణ జేఏసీ నాయకులు వంగ భీమ్‌రాజ్, మంతెన మణికుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టి, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి సముచిత గుర్తింపు కల్పించాలని కోరారు. అలాగే తెలంగాణ ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఉద్యమకారులకు పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం, వారి పిల్లలకు ఉచిత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత, కార్పొరేట్ స్థాయి వైద్య, రవాణా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో నమోదైన ఎఫ్ఐఆర్‌లను అడ్డంకిగా పరిగణించకుండా నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ జేఏసీ కన్వీనర్ పాపిరెడ్డితో పాటు వివిధ జిల్లాల ఉద్యమకారులు పాల్గొని ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కూడా వారు కోరారు.

## బిజినెస్

# మార్కెట్‌లో భారీ జోష్.. సెన్సెక్స్ 964 పాయింట్ల జంప్!


**24,334 వద్ద ముగిసిన నిఫ్టీ**
**బ్యాంకింగ్, ఐటీ షేర్లలో కొనుగోళ్లు**
**ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లలో ఒత్తిడి**
**దేశీయ మార్కెట్ సెంటిమెంట్ నిలకడగా ఉందన్న నిపుణులు**



ప్రైవేట్ బ్యాంకింగ్, ఐటీ, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్లు నమోదవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. ఉదయం నుంచి కొనుగోళ్ల జోరు కొనసాగడంతో సూచీలు రోజంతా గ్రీన్‌లోనే ట్రేడ్ అయ్యాయి. చివరకు సెన్సెక్స్ 964.58 పాయింట్లు ఎగబాకి 78,151.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 261.55 పాయింట్లు పెరిగి 24,334.30 వద్ద స్థిరపడింది. మార్కెట్‌లో ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు రాణించాయి. నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీ 2.12 శాతం లాభపడింది. ఐటీ సూచీ 1.75 శాతం ఎగబాకింది. రియాల్టీ సూచీ 1.34 శాతం, ఆటో సూచీ 1.24 శాతం చొప్పున పెరిగాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. నిఫ్టీ-50 సూచీలో టెక్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు అత్యధికంగా లాభపడ్డ వాటిలో ఉన్నాయి. హిందాల్కో, డాక్టర్ రెడ్డీస్, విప్రో, సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్స్ షేర్లు నష్టపోయాయి. ఏఐ కంపెనీల అధిక విలువలు, పశ్చిమాసియా భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా.. దేశీయ మార్కెట్ సెంటిమెంట్ నిలకడగా ఉందని నిపుణులు తెలిపారు. తొలి త్రైమాసిక ఫలితాలపై నెలకొన్న అంచనాలు, కంపెనీల వ్యాపార అప్‌డేట్లు కూడా కొనుగోళ్లకు ఊతమిచ్చాయని విశ్లేషించారు. సాంకేతికంగా చూస్తే నిఫ్టీకి 24,400 స్థాయి కీలక నిరోధంగా ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ స్థాయిని దాటితే సూచీ 24,500 నుంచి 24,600 స్థాయుల దిశగా కదిలే అవకాశం ఉందని అంచనా వేశారు. మరోవైపు 24,200 తక్షణ మద్దతుగా మారిందని, ఆ తర్వాత 24,000 స్థాయి కీలక సపోర్ట్‌గా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# వరల్డ్ కప్ ఫైనల్‌కు రెఫరీగా విన్సిచ్.. అర్జెంటీనాకు పాత భయాలు.. మెస్సీ అభిమానుల్లో టెన్షన్!





2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. న్యూయార్క్ వేదికగా ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య జరిగే ఈ టైటిల్ పోరుకు స్లోవేనియాకు చెందిన ప్రముఖ రెఫరీ స్లావ్కో విన్సిచ్‌ను ఫిఫా నియమించింది. ఈ వార్త ఫుట్‌బాల్ ప్రపంచంలో సంతోషం నింపినప్పటికీ, అర్జెంటీనా అభిమానుల్లో మాత్రం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. దీనికి కారణం విన్సిచ్ రెఫరీయింగ్‌లో అర్జెంటీనాకు ఉన్న ఒక చేదు గతం. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు తనను ఎంపిక చేసినట్లు తెలియగానే, రెఫరీ కిట్ అందుకుంటూ విన్సిచ్ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతనికి సహాయకులుగా తోమాజ్ క్లాంక్నిక్, ఆంద్రాజ్ కోవాసిచ్ (ఇద్దరూ స్లోవేనియాకు చెందినవారే) వ్యవహరించనున్నారు.

**అర్జెంటీనాకు ఎందుకు ఆందోళన?**

స్లావ్కో విన్సిచ్ పేరు వినగానే అర్జెంటీనా అభిమానులకు 2022 ఖతార్ ప్రపంచకప్‌లో జరిగిన ఒక ఘోర పరాభవం గుర్తుకొస్తుంది. ఆ టోర్నమెంట్‌లో అర్జెంటీనా ఆడిన తొలి మ్యాచ్ సౌదీ అరేబియాతో జరిగింది. నవంబర్ 22న లుసైల్ స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్‌కు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఆట ప్రారంభమైన 8వ నిమిషంలోనే అర్జెంటీనాకు పెనాల్టీ ఇవ్వగా, మెస్సీ గోల్ చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ మొత్తం మీద సౌదీ ఆటగాళ్లకు ఆరు ఎల్లో కార్డులు కూడా చూపించాడు. కానీ, చివరికి ఫలితం తారుమారైంది. సెకండాఫ్‌లో సౌదీ అరేబియా సంచలన ప్రదర్శన చేసి 2-1 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచకప్ చరిత్రలోనే అది ఒక పెద్ద షాక్. మెస్సీ జట్టు విన్సిచ్ రెఫరీయింగ్ లో ఓడిపోయిన ఏకైక మ్యాచ్ కూడా ఇదే కావడం గమనార్హం. ఈ పాత జ్ఞాపకాలే ఇప్పుడు అర్జెంటీనా అభిమానులను కలవరపెడుతున్నాయి.

**స్పెయిన్‌కు మాత్రం సానుకూల చరిత్ర**

అర్జెంటీనాకు విన్సిచ్‌తో చేదు అనుభవం ఉంటే, స్పెయిన్‌కు మాత్రం అతనితో సానుకూల రికార్డు ఉంది. యూరోపియన్ టోర్నీలలో స్పెయిన్ ఆడిన అనేక కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా వ్యవహరించాడు. 2017లో కొలంబియాతో స్నేహపూర్వక మ్యాచ్, యూరో 2020లో స్వీడన్‌తో గ్రూప్ మ్యాచ్, 2023లో ఇటలీతో నేషన్స్ లీగ్ సెమీ-ఫైనల్ మ్యాచ్‌లకు అతడు బాధ్యతలు నిర్వర్తించాడు. ముఖ్యంగా యువ సంచలనం లామిన్ యమాల్ జట్టులోకి వచ్చాక, యూరో 2024లో ఇటలీ, ఫ్రాన్స్‌లపై స్పెయిన్ గెలిచిన కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఈ రికార్డు స్పెయిన్ జట్టుకు కొంత ఊరటనిచ్చే అంశం.

**ఈ వరల్డ్‌కప్‌లోనూ వివాదం**

ప్రస్తుత ప్రపంచకప్‌లో కూడా విన్సిచ్ తన కఠిన నిర్ణయాలతో వార్తల్లో నిలిచాడు. మెక్సికో-ఈక్వెడార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈక్వెడార్ ఆటగాడు పీరో హిన్కాపీకి రెడ్ కార్డ్ చూపించాడు. ప్రత్యర్థి ఆటగాడితో మాట్లాడేటప్పుడు నోటికి చేయి అడ్డుపెట్టుకోవడం ఫిఫా నియమావళిని ఉల్లంఘించడమేనని భావించి ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీన్ని బట్టి చూస్తే, అతడు నిబంధనల విషయంలో ఎంత కఠినంగా ఉంటాడో అర్థమవుతుంది. అర్జెంటీనా మ్యాచ్‌లలో రెఫరీ నిర్ణయాలు తరచూ వివాదాస్పదం అవుతున్న నేపథ్యంలో, ఈ ఫైనల్‌లో స్లావ్కో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై ప్రపంచం దృష్టి నిలుస్తుంది. అతనిపై తీవ్ర ఒత్తిడి ఉండటం ఖాయం.

> 2026 ప్రపంచకప్ ఫైనల్‌కు రెఫరీగా స్లోవేనియాకు చెందిన స్లావ్కో విన్సిచ్
> 2022లో విన్సిచ్ రెఫరీయింగ్‌లోనే సౌదీ చేతిలో అర్జెంటీనా ఓటమి
> తాజా నియామకంతో అర్జెంటీనా అభిమానుల్లో నెలకొన్న ఆందోళన
> స్పెయిన్ ఆడిన కీలక మ్యాచ్‌లలో విన్సిచ్ రెఫరీగా వ్యవహరించి సానుకూల ఫలితాలు
> ఫైనల్‌లో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై తీవ్ర ఒత్తిడి ఉండే అవకాశం

## క్రీడలు

# భారత్‌కు రోహిత్-కోహ్లీ.. ఇంగ్లాండ్‌కు జో రూట్: కుంబ్లే

**రూట్‌ను విరాట్, రోహిత్‌తో పోల్చిన కుంబ్లే**
**ఈ ముగ్గురూ ఒత్తిడిలో ఇన్నింగ్స్ నిర్మిస్తారని ప్రశంస**
**రూట్ వన్డే శైలిపై ప్రత్యేక వ్యాఖ్యలు**
**ముగ్గురూ బంతిని చూసి స్పందిస్తారని వివరణ**



తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లని ఎంచుకుంటారని ప్రశంస
టీమిండియాకు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఎంత కీలక ఆటగాళ్లో ఇంగ్లండ్‌కు జో రూట్ అంతే కీలకమని మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అన్నాడు. ఒత్తిడిలో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే సామర్థ్యం ఈ ముగ్గురిలోనూ ఒకేలా ఉంటుందని చెప్పాడు. కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో రూట్ ఆడిన 99 పరుగుల ఇన్నింగ్స్‌పై స్పందిస్తూ కుంబ్లే ఈ వ్యాఖ్యలు చేశాడు. 234 పరుగుల లక్ష్య ఛేదనలో రూట్ 133 బంతుల్లో 99 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్‌ను చివరి వరకు నడిపించి ఇంగ్లండ్‌కు నాలుగు వికెట్ల విజయాన్ని అందించాడు. అయితే గస్ అట్కిన్సన్ బౌండరీ కొట్టడంతో రూట్ ఒక్క పరుగు తేడాతో సెంచరీ మిస్ చేసుకున్నాడు.
రూట్ ఇప్పటికీ సంప్రదాయ వన్డే శైలిలోనే బ్యాటింగ్ చేస్తాడని కుంబ్లే పేర్కొన్నాడు. మిగతా ఇంగ్లండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడగా, రూట్ మాత్రం ఓపికగా ఇన్నింగ్స్‌ను నిర్మించాడని చెప్పాడు. స్ట్రైక్‌ను మారుస్తూ, గ్యాప్‌లలోకి బంతిని పంపిస్తూ ఒత్తిడిని తగ్గించడంలో అతను సిద్ధహస్తుడని కొనియాడాడు. అవసరం లేని సమయంలో రిస్క్ షాట్లు ఆడకపోవడమే అతని బలం అని వివరించాడు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో పోలిస్తే రూట్ ప్రత్యేకత స్పష్టంగా కనిపించిందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు. పరిస్థితులు సహకరించని పిచ్‌పై కూడా బ్రూక్ టీ20 తరహా షాట్లు ఆడేందుకు ప్రయత్నించాడని, రూట్ మాత్రం వన్డే బ్యాటింగ్‌కు ఆదర్శంగా నిలిచే ఇన్నింగ్స్ ఆడాడని పేర్కొన్నాడు. రూట్, విరాట్, రోహిత్ విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం కూడా ఇదేనని కుంబ్లే చెప్పాడు. ఈ ముగ్గురు ముందే షాట్ నిర్ణయించుకోరని, బంతిని చూసి స్పందిస్తారని వివరించాడు. తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లనే ఎంచుకుంటారని తెలిపాడు. అలాంటి ఆటతీరు జట్టుకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు.

# ‘ఏక్ దిన్’( అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!

తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో సాయిపల్లవికి ఎంతో క్రేజ్ ఉంది. సాయిపల్లవి ఒక కథకు ఓకే చెప్పిందంటే, ఆ కథలో ఏదో బలమైన పాయింట్ ఉండి ఉంటుందని అభిమానులు భావిస్తూ ఉంటారు. అలాంటి సాయిపల్లవి తొలిసారిగా ఒక హిందీ సినిమా చేసింది. ఆ సినిమా పేరే ‘ఏక్ దిన్’. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా, మే 1వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ‘అమెజాన్ ప్రైమ్’ దక్కించుకుంది. ఈ రోజు (జులై 17) నుంచి ఈ సినిమా హిందీతో పాటు ఇతర భాషల్లో అందుబాటులోకి వచ్చింది. దినేష్ (జునైద్ ఖాన్) ఒక సాఫ్ట్ వేర్ సంస్థలో పనిచేస్తూ ఉంటాడు. అదే ఆఫీసులో మీరా రంగనాథ్ (సాయిపల్లవి) వర్క్ చేస్తూ ఉంటుంది. ఆమెను చూడగానే అతను మనసు పారేసుకుంటాడు. అయితే ఆమె ఆ సంస్థకి చెందిన ‘నకుల్’ (కునాల్ కపూర్)తో చనువుగా ఉండటం చూసి చాలా ఆవేదన చెందుతూ ఉంటాడు. నకుల్ తన భార్య ‘రీతూ’ (జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్)తో విడాకులు తీసుకోనున్నట్టు మీరాతో చెబుతాడు. మీరా పట్ల తనకి గల ప్రేమను వ్యక్తం చేస్తాడు. మీరాకి ‘జపాన్’ను చూడాలనే కోరిక చిన్నప్పటి నుంచి బలంగా ఉంటుంది. ఆ విషయం నకుల్ కి తెలుసు. ఆ ఏడాది తాము టార్గెట్ రీచ్ అయ్యామంటూ, అతను ఎంప్లాయిస్ ను జపాన్ తీసుకుని వెళతాడు. అక్కడ నకుల్ తో మీరా మరింత సాన్నిహిత్యంగా ఉండటం చూసి, దినేష్ బాధపడతాడు. అయితే అనుకోకుండా అక్కడికి నకుల్ భార్య ‘రీతూ’ వస్తుంది. ఆమె గర్భవతి అని మీరాకి తెలుస్తుంది. రీతూకి విడాకులు ఇవ్వనున్నట్టు తనకి నకుల్ చెప్పింది అబద్ధమని గ్రహిస్తుంది. తనని నకుల్ మోసం చేయడాన్ని తట్టుకోలేని మీరా, విపరీతంగా తాగేసి ప్రమాదానికి గురవుతుంది. ఆమెను హాస్పిటల్లో చేరుస్తాడు దినేష్. ఆమె తన గతాన్ని మరిచిపోయిందనీ, 24 గంటల తరువాత గతం గుర్తుకు వస్తుందని డాక్టర్లు చెబుతారు. అయితే గతం గుర్తుకు వచ్చిన తరువాత, ఈ 24 గంటలలో ఏం జరిగిందనేది ఆమెకి ఎంతమాత్రం గుర్తుకురాదని అంటారు. అప్పుడు దినేష్ ఏం చేస్తాడు? ఒక్కరోజుపాటు తనతో మీరా ప్రేమగా ఉన్నా చాలనుకున్న అతని కోరిక నెరవేరుతుందా? ఆ రోజు తరువాత, దినేష్ తో గడిపిన క్షణాలు ఆమెకి గుర్తుంటాయా? అనేది మిగతా కథ. శ్రీమంతుడైన ఒక యువకుడు తన ఆఫీసులో పనిచేసే ‘మీరా’పై కన్నేస్తాడు. తన భార్య మంచిది కాదంటూ, మీరాకి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తాడు. జపాన్ చూడాలనే ఆమెలోని కోరికను తనకు అనుకూలంగా మార్చుకుంటాడు. మిగతా ఎంప్లాయిస్ తో పాటు అక్కడికి తీసుకుని వెళతాడు. ఆమెను సొంతం చేసుకోవడానికి రంగాన్ని సిద్ధం చేస్తాడు. అతని నిజస్వరూపం తెలుసుకున్న మీరా ప్రమాదానికి గురవుతుంది. ఆమెను మౌనంగా ఆరాధిస్తూ .. అనుసరిస్తూ వస్తున్న దినేష్ ఏం చేస్తాడు? అనే అంశం చుట్టూ నడిచే కథ ఇది. ఈ కథ అంతా మీరా .. నకుల్ .. దినేష్ చుట్టూ తిరుగుతుంది. ప్రేమ పేరుతో ఆకర్షించే నకుల్, ప్రేమ అనుకుని ఆకర్షణ దిశగా పరిగెత్తే మీరా, ఆమె ప్రేమ కోసం ఎంతకాలమైనా ఎదురు చూడొచ్చునని భావించే దినేష్ పాత్రలు ఈ కథలో ప్రధానమైనవి. కథను మొదటి నుంచి చివరి వరకూ నడిపించేంత కీలకమైనవి. తెరపై ఎక్కువగా ఈ మూడు పాత్రలు మాత్రమే కనిపించినా, ఎక్కడా బోర్ అనిపించదు. ప్రతి సన్నివేశంలోని ఫీల్ కనెక్ట్ అవుతుంది. జీవితంలో ఎవరు ఎలాంటి వాళ్లు అనేది తెలియాలంటే అవసరమో .. ఆపదో రావాలంటారు. అప్పుడే మనతో నిలబడేదెవరో .. మనలను నిలబెట్టేదెవరో అర్థమైపోతుంది. సరిగ్గా ఆ పాయింట్ ను టచ్ చేస్తూనే దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. నిజమైన ప్రేమను పంచే మనసును .. వాళ్ల పలకరింపును .. స్పర్శను మరిచిపోవడం అసాధ్యమనే విషయాన్ని దర్శకుడు ఆవిష్కరించిన విధానం గొప్పగా అనిపిస్తుంది. సాయిపల్లవి నటన ఈ సినిమాకి హైలైట్ అని చెప్పాలి. ఆడంబరాలు .. ఆకర్షణలు కాదు, ప్రేమించడానికి మంచి మనసు ఉండాలని నిరూపించే పాత్రలో జునైద్ కూడా నీట్ గా చేశాడు. అవసరం .. అవకాశం తప్ప మనిషికీ .. మనిషికి మధ్య మరేమీ ఉండదనే పాత్రలో కునాల్ నటన కూడా ఆకట్టుకుంటుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ .. లొకేషన్స్ ఈ కథను మరింత సపోర్టు చేస్తూ సాగుతాయి.జీవితంలో మనలను ప్రేమించే మనిషంటూ ఒకరి ఉంటే, ఆ ప్రయాణం ఎంతో అందంగా .. అనుభూతి మయంగా ఉంటుంది. అలాంటి ప్రేమను అర్థం చేసుకోలేకపోతే ఆ వెలితి వెంటాడుతూ ఉంటుంది. నిజమైన ప్రేమ .. నిస్వార్థమైన ప్రేమ ఓడిపోయిన దాఖలాలు దాదాపుగా లేవని నిరూపించే ఈ కథ, ఫ్యామిలీ ఆడియన్స్ కి తప్పకుండా కనెక్ట్ అవుతుంది.




# జానీ మాస్టర్‌కు ఫెడరేషన్ షాక్.. షోకాజ్ నోటీసు, బహిష్కరణ

**ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఫెడరేషన్ షోకాజ్ నోటీసు**

**ఫెడరేషన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపణ**

**జానీ మాస్టర్‌తో ఏ సినిమాకూ సహకరించబోమని ప్రకటన**

**ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశం**

ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై తెలుగు చలనచిత్ర కార్మిక సమాఖ్య (ఫెడరేషన్) కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఫెడరేషన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయనపై దేశవ్యాప్త బహిష్కరణ విధిస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. జూలై 12న జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తన సమాఖ్య ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని ఫెడరేషన్ పేర్కొంది. ఈ అంశంపై వివరణ ఇచ్చేందుకు జూలై 14న విచారణకు హాజరుకావాలని ఆదేశించినప్పటికీ ఆయన గైర్హాజరైనట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో, ఏడు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో స్పష్టం చేసింది. ఆదేశాలను బేఖాతరు చేస్తే మరిన్ని కఠిన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించింది. సమాఖ్య తీసుకున్న ఈ నిర్ణయం వల్ల జానీ మాస్టర్ పనిచేసే ఏ చిత్రానికైనా, ఏ భాష చిత్ర పరిశ్రమలోనైనా కార్మికులు సహకరించబోరని ఫెడరేషన్ స్పష్టం చేసింది. ఈ పరిణామం ఆయన వృత్తిగత కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు, డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలి హోదాలో ఉన్న జానీ మాస్టర్ భార్య సుమలత వ్యవహారశైలిపై కూడా ఫెడరేషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇటీవల తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో జానీ మాస్టర్, శేఖర్ మాస్టర్ వర్గాల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఫెడరేషన్ అనుమతి లేకుండా సుమలత ఉప ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం వంటి చర్యలే ఈ వివాదానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. అయితే, మెగాస్టార్ చిరంజీవి జోక్యంతో తమ మధ్య విభేదాలు తొలగిపోయాయని, ‘విశ్వంభర’ చిత్ర సెట్స్‌లో అంతా సర్దుకుందని జానీ మాస్టర్ వివరణ ఇచ్చారు.



## తెలుగు ఇండస్ట్రీని ఆకాశానికెత్తిన రకుల్ ప్రీత్..

టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనితీరుపై కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని సహకార స్ఫూర్తిని కొనియాడిన ఆమె, బాలీవుడ్‌లో మాత్రం అభద్రతాభావం, అసూయ వంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తన సినీ ప్రయాణం మొదలైన తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. “టాలీవుడ్‌లో ఒకరి సినిమాలను మరొకరు బహిరంగంగా ప్రోత్సహిస్తారు. తోటి నటీనటుల చిత్రాల ట్రైలర్లను వడుదల చేయడం, వేడుకలకు హాజరవ్వడం వంటివి ఇక్కడ సాధారణం. వృత్తిపరమైన పోటీ ఉన్నప్పటికీ, ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారు” అని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో బాలీవుడ్ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, అక్కడ అసూయ, అభద్రతాభావం కారణంగా పరస్పర సహకారం చాలా తక్కువని ఆమె అన్నారు. కొందరు కావాలనే ఇతరులపై ప్రతికూల ప్రచారాలు (నెగెటివ్ పీఆర్ క్యాంపెయిన్లు) నిర్వహిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “తెలుగు పరిశ్రమలో ఐక్యత, సహృద్భావం మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలను హిందీ పరిశ్రమ కూడా అలవర్చుకుంటే అది మరింత బలోపేతం అవుతుంది” అని రకుల్ సూచించారు. గతంలోనూ అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి అగ్ర హీరోల వినయాన్ని, వృత్తి పట్ల వారికున్న నిబద్ధతను ఆమె కొనియాడారు.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455